
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

ఆదివారం 19 మే 2024

ధర్మపురిలో వైభవంగా చందనోత్సవం 7లో..

డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు అష్ట కష్టాలు.. 7లో..



శాసనసభ, లోక్‌సభ ఎన్నికలు ముగియగా, ఇక స్థానిక సంస్థల వంతు కావడంతో గ్రామాల్లో కోలాహలం నెలకొననుంది. వచ్చే నెల 4వ తేదీతో ఎన్నికల కోడ్ ముగియనుంది. ఆ తర్వాత ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే పల్లెల్లో సందడి వాతావరణం షురూ కానుంది. సర్పంచుల పదవీకాలం గత ఫిబ్రవరితో ముగిసింది. ఇక మం డల, జిల్లా పరిషత్‌ల పదవీకాలం జూలై 3వ తేదీతో ముగియనుంది. గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీలకతీతంగా కావడంతో ముందుగా వాటిని నిర్వహిస్తే జిల్లాలో అన్ని పంచాయతీల్లో పోలింగ్ జరగనుంది. 2019లో మూడు విడతల్లో ఈ ఎన్నికలను నిర్వహించారు. పంచాయతీ ఎన్నికల తర్వాత మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను నిర్వహించే అవకాశం ఉంది. ఇవి పార్టీల గుర్తులతో పోటీ చేయనున్నారు. ఒక వేళ ప్రభుత్వం బీసీ గణన చేపడితే రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలను నిర్వహించనుంది. ఇందుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. గత ఎన్నికల్లో 18 మండలాల్లో ఎన్నికలు జరిగాయి. కొత్తగా బీమారం, ఎండపల్లి మండలాలు ఏర్పడ్డాయి. అందువల్ల ఇరవై మండలాల్లో ఎన్నికలను నిర్వహించనున్నారు.

గ్రామాల్లో కోలాహలమే..

ఇక పంచాయతీ సమరమే

- సర్పంచ్ ఎన్నికల వైపు.. అధికారుల చూపు
- బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉంచాలని ఆదేశాలు
- ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం మొగ్గు
- ఆశావహులు సన్నద్ధం.. పల్లెల్లో కోలహాలమే
- జిల్లాలో 380 పంచాయతీలు.. 3,500 వార్డులు

జగిత్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ముగిసి, ఓట్ల లెక్కింపు మిగిలి ఉండడంతో స్థానిక సంస్థల ఎన్నికలపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. తాజాగా పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం బ్యాలెట్ బాక్సులు సరి చూసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. పదవీకాలం ముగిసిన పంచాయతీలతో పాటు ఎన్నికలు జరగని గ్రామాల్లోనూ వీటి నిర్వహణకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. లోక్‌సభ ఎన్నికలు ఈవీఎంలతో నిర్వహించగా పంచాయతీ ఎన్నికలు బ్యాలెట్ బాక్సులతో సాగనుంది. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 2న ముగియడంతో ఆ వెంటనే ప్రత్యేక అధికారుల పాలన మొదలైంది. వాస్తవానికి జనవరిలో ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాటు చేయాల్సి ఉన్నా ఉద్యోగుల వివరాలు సేకరించి వదిలి పెట్టారు. తాజాగా బ్యాలెట్ బాక్సుల లెక్కలు సరిచూడాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారుల నుంచి అన్ని జిల్లాల పంచాయతీ అధికారులకు ఆదేశాలు వచ్చాయి. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలో ఉన్న బ్యాలెట్ బాక్సులు తీసుకోవాలని చుట్టుపక్కల ఉన్న కొన్ని జిల్లాలకు అధికారులు సూచించారు.

జగిత్యాల జిల్లాలోని పంచాయతీలకు బ్యాలెట్ బాక్సులు సరిపడా ఉన్నాయని సంబంధిత వర్గాలు అంటున్నాయి. దీంతో పాటు పోలింగ్ సిబ్బందికి ఆర్‌వో బుక్‌లు ఏ మేరకు అవసరం అవుతాయో వివరాలు పంపాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఎన్నికలు ఒకేసారి కాకుండా మూడు విడతల్లో నిర్వహించనున్నారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఆర్‌వో బుక్‌లు సైతం ఎక్కువ సంఖ్యలోనే అవసరమవుతాయని అధికారులు లెక్కలు వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 380 గ్రామ పంచాయతీలు, 3,500 వార్డులలో ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు కసరత్తులు చేస్తున్నారు.

200 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం

ఓటర్ల సౌలభ్యం కోసం 200 ఓటర్ల వరకు ఒక పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిసింది. దీనికోసం ఒక ప్రిసైడింగ్ అధికారి, పోలింగ్ ఆఫీసర్‌ను నియమించాల్సి ఉంటుంది. 200 నుంచి 400 వరకు ఒక ప్రిసైడింగ్ అధికారి, ఇద్దరు సహాయ అధికారులు, 401 మంది ఓటర్ల నుంచి 650 మంది ఓటర్ల వరకు ఒక ప్రిసైడింగ్ అధికారి, మరో ముగ్గురు సహాయ అధికారులను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

జిల్లాలో ఓటర్లకు అనుగుణంగా పోలింగ్ సిబ్బంది వివరాలు సేకరించారు. ఉద్యోగుల సంఖ్య సరిపోని పరిస్థితి ఉంటే ప్రభుత్వ రంగ సంస్థ లు, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, గురుకులాలు, ఎయి డెడ్ పాఠశాలలు, ఇతర సంస్థల సిబ్బందికి విధులు కేటాయించనున్నారు. ప్రతి వార్డుకు ఒక పోలింగ్ కేంద్రం ఉంటుంది. ప్రతి కేంద్రంలో ఒక బ్యాలెట్ బాక్సు వార్డు సభ్యుడి ఎంపికకు, మరో బ్యాలెట్ బాక్సు సర్పంచి ఎన్నికకు ఏర్పాటు చేస్తారు. ఇవే లెక్కలు సరిచూసి బ్యాలెట్ బాక్సులను అధికారులు అంచనా వేశారు. బాక్సుల కొరత లేకపోవడంతో ఎలాంటి సమస్య లేదని అధికారులు అంటున్నారు. అవసరమైన బ్యాలెట్ బాక్సుల సంఖ్యకు తోడు అదనంగా ఇరవై శాతం బాక్కులను అందుబాటులో ఉంచారు.

మద్దతుకు ప్రయత్నం...

స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్న సమాచారంతో గ్రామాల్లో ఆశావహుల సందడి నెలకొంది. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేయాలనుకునే వారు సన్నద్ధమవుతున్నారు. మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేయాల్సి రావడంతో టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు అధిష్టానం, ముఖ్యనాయకులతో టచ్‌లో ఉంటున్నారు. మూడు ప్రధాన రాజకీయ పక్షాల అభ్యర్థులు బరిలో దిగే అవకాశం ఉంది. గతంలో పోటీ చేసి ఓటమి పాలైన వారు, కొత్తగా పోటీ చేయాలనే ఆలోచన ఉన్న నేతలు ఈ పదవులపై కన్నేసి ఉంచుతున్నారు. అటు గ్రామ పంచాయతీ, ఇటు మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు సమీపిస్తుండడంతో పల్లెల్లో రాజకీయ సందడి నెలకొంది.



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..

దేవరాజు, జిల్లా పంచాయతీ అధికారి, జగిత్యాల

పంచాయతీ ఎన్నికలపై ఉన్నతాదికారుల ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేయడానికి సిద్ధంగా ఉన్నాము. ఇప్పటికే ఇందుకు అవసరమైన పలు సమాచారాల ను ప్రాథమికంగా సేకరించాము. ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికలు నిర్వహించడానికి నిర్ణయించిన పకడ్బందీగా పూర్తి చేయడానికి అవసరమైన ముందస్తు ఏర్పాట్లు చేసుకున్నాము.

ఆసక్తి ఉన్న కూలీలను ఈజీఎస్ పనులకు తీసుకరావాలి

జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దివాకర

జగిత్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆసక్తి ఉన్న కూలీలందరిని ఈజీఎస్ పనులకు తీసుకరావాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకర సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో ఎంపీడీవోలు, ఏపీవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడారు. రాబోయే నెల రోజుల వరకు ప్రతీ గ్రామంలో నిరంతరంగా పని కల్పించుటకు కావాల్సిన పనులను గుర్తించి సిద్దంగా ఉండాలని సూచించారు. మండలాల వారిగా తక్కువ లేబర్ రిపోర్ట్ అవుతున్న పరిస్థితులను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఒక పని పూర్తికాగానే మరొక పనిని గుర్తించి కూలీలు పనికి వచ్చేటట్లు హాజరు శాతం తగ్గకుండా చూడాలన్నారు. ప్రస్తుత సంవత్సరం ఎక్కువ కుటుంబాలకు పని కల్పించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో మదన్ మోహన్, జడ్పీ సీఈవో రఘువరన్, ఆయా మండలాల ఎంపీడీవోలు, ఏపీవోలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేయడం సిగ్గుచేటు

రాయికల్, మే 18: పదేళ్ల పాలనలో ఏనాడూ రైతుల సంక్షేమాన్ని పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు వరిధాన్యం కొనుగోలు విషయంలో ధర్నాలు చేయడం సిగ్గుచేటని యూత్ కాంగ్రెస్ నాయకుడు ఏలేటి జలందర్ రెడ్డి అన్నారు. రాయికల్‌లో శనివారం ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా తుడుచు పెట్టుకుపోనుందని భావించి ఉనికి కోసమే ఆ పార్టీ నేతలు ధాన్యం కొనుగోలు పేరుతో ధర్నాలు అంటూ డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పాలనలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తూ ప్రాణాలు కోల్పోయినప్పటికీ కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. పదవి పోయాక కేసీఆర్ రైతులపై ముసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు.

నిరుపేద విద్యార్థులకు అండగా నిలవాలి

జిల్లా అదనపు ఎస్పీ వినోద్ కుమార్



ఆర్థిక సహాయం అందజేస్తున్న అదనపు ఎస్పీ

జగిత్యాల టౌన్, మే 18:నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువులకు అండగా నిలువాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని జిల్లా అదనపు ఎస్పీ వినోద్ కుమార్ అన్నారు. పెద్దపెల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రానికి చెందిన కైలాస రాజేశ్వర్-రూపారాణి దంపతుల కూతురు ఆదర్శ ఉన్నత చదువుల కోసం విజయవాడలోని మిట్టగూడెంలో ఉన్న కళాశాలలో సీఎంఏ కోర్సులో సీటు సాధించింది. ఫీజు చెల్లించేందుకు ఆర్థిక చేయూత నివ్వాలని కోరుతూ తల్లిదండ్రుల సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. జగిత్యాల జిల్లా ఆవోపా అధ్యక్షుడు రాజేశుని శ్రీనివాస్ నిర్వహిస్తున్న వాసవి సేవాదళ్ ద్వారా రూ. 56,705 ఆర్థిక సహాయాన్ని సమకూర్చారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం విద్యార్థిని ఆదర్శకు ఆర్థిక సహాయం అందజేశారు. నిరుపేద విద్యార్థినికి ఆర్థిక సహాయం అందించేలా కృషి చేసిన శ్రీనివాస్‌తో పాటు వాసవి సేవాదళ్ సభ్యులను అదనపు ఎస్పీ అభినందించారు.

జగిత్యాల ఆర్‌డీవోకు సన్మానం

జగిత్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో సీనియర్ సిటిజన్స్ ఓటేసేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేసి నందుకు గానూ జగిత్యాల ఆర్‌డీవో మధుసూదన్‌ను పలువురు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడారు. 85 ఏళ్ల పైబడిన వయో వృద్ధులకు ఇంటి నుంచే ఓటు మక్కు వంద శాతం కల్పించడంతో పాటు అంగవైకల్యం గల వారికి వీల్ చైర్‌తో పాటు ప్రత్యేక క్యూ తదితర సౌకర్యాలు కల్పించడం పట్ల తమ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు హరి అశోక్ కుమార్, నాయకులు గౌరిశెట్టి విశ్వ నాథం, వెలముల ప్రకాశ్ రావు, బొల్లం విజయ్, హన్మంత్‌రెడ్డి, యాకూబ్, అశోక్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్



ముక్కట్రావ్‌పేటలో ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి

వెల్గటూర్, మే 18: గ్రామాలలో ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారి పుప్పాల శ్రీధర్ వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం మండలంలోని ముక్కట్రావ్‌పేట సబ్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలకు, అన్ని వయసుల చిన్నారులకు సమయం ప్రకారం వ్యాక్సిన్‌లు ఇవ్వాలన్నారు. ఎండా కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. రాబోయే వర్షా కాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ శుక్రవారం గ్రామ స్థాయి అధికారుల సమన్వయంతో డ్రై డే నిర్వహించాలని సూచించారు. మండల వైద్యాధికారి శ్రావణ్ కుమార్, సీహెచ్‌వో జగన్నాథం, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈత వనం పరిశీలన

భీమారం, మే 18: మండల కేంద్రంలో శుక్రవారం ప్రమాదవశాత్తు దగ్ధమైన ఈత వనాన్ని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్ నరేష్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈత వనం కాలిపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలా గౌడన్నలను ఆదుకుంటామన్నారు. ఆయన వెంట గ్రామ గౌడ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

రహదారి వెంట చెత్త.. ప్రయాణికులకు చింత



రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త

మల్యాల, మే 18: మల్యాల మేజర్ గ్రామపంచాయితీ పరిధిలోని బీసీ కాలనీ సమీపంలో రహదారి వెంట అ పరిశుభ్రత ప్రజలకు అసౌకర్యంగా మారింది. మల్యాల నుంచి పెగడపల్లి వెళ్లే ఈ బైపాస్ మార్గంలో రహదారి పక్కనే చెత్త కుప్పలు అపరిశుభ్రతతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. దీంతో ఈ మార్గంలో వెళ్లే వారు ఇబ్బం దులు పడుతున్నారు. చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాల్సి ఉండగా రహదారిపైనే ఉండడంతో దారి వెంట చెత్త అ ధ్వానంగా మారుతుంది. అధికారులు చర్యలు తీసుకోవా లని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు

ఈనెల 21న వాహనాల వేలం

జగిత్యాల టౌన్, మే 18: జిల్లా ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారి ఆదేశాల మేరకు జగిత్యాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన 9 వాహనాలకు ఈ నెల 21న బహిరంగ వేలం వేస్తున్నట్లు సీఐ సర్వేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ధరూర్ క్యాంపులో ఉన్న ఎక్సైజ్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు హాజరై వేలంలో పాల్గొనవచ్చునని వివరించారు.

నిత్యావసర సరుకులు అందజేత

వెల్గటూర్, మే 18: వాసవి జయంతి సందర్భంగా కిషన్‌రావుపేట గ్రామానికి చెందిన ఆర్య వైశ్య దివ్యాంగురాలు రాయంచు వాసవికి శనివారం సముద్రాల రమేష్ నిత్యావసర సరుకులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వాసవి కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి ఆసిఫాబాద్ కొమురం భీం జిల్లా ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు గులుబం చక్రపాణి దృష్టికి తీసు కవెళ్లగా ఆయన స్పందించి 25 కిలోల బియ్యం, సుమారు రూ.2 వేల విలువ గల నిత్యావసర సరుకులు, వెయ్యి రూపాయల నగదు అందజేసినట్లు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి ఈ నిరుపేద యువతిని ఆదుకోవాలని కోరారు.

చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలి

- కోరుట్ల మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి పావని

కోరుట్ల రూరల్, మే 18 : సైబర్ నేరాలకు గురి కాకుండా చట్టలపై ప్రతి పౌరడు అవగాహన కలిగి ఉండాలని కోరుట్ల మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి పావని అన్నారు. శనివారం మడలంలోని కల్లూర్ గ్రామంలో కోరుట్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాణ సదస్సులో న్యాయమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్ని పజలకు చట్టాలు, జనజీవనపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. హింస మార్గంతో కాకుండా ఎదైన సమస్య వస్తే రాజీమార్గంతో పరిష్కరించుకోవాలని సూచించారు.

నేరాలకు తావివ్వకుండా గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వన తడుపుల అంజయ్య, ఎంపీటీసీ సభ్యురాలు లత-రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావులతో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయాధికారి పావని

ఘనంగా వాసవీ మాత జయంతి ఉత్సవాలు

ధర్మపురి, మే 18: ధర్మపురి క్షేత్రంలో వాసవీ కన్యకా పరమేశ్వరీ జయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్య వైశ్య వాసవీ నిత్యాన్న సత్ర సంఘం ఆవరణలో గల వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఉదయం ఆలయ అర్చకులు ఒజ్జల విలాస్ వేద మంత్రాల మధ్య అమ్మవారలకు పుష్ప, ఫల, పాల అభిషేకాలు, అలంకరణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి వేళలో తమ కుటుంబ సౌభాగ్యం కోసం ఆర్య వైశ్య మహిళలు అమ్మవారలకు సా మూహిక కుంకుమ పూజలు చేశారు. అనేక మంది భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేసి అమ్మ వారలను దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ శాఖల అధ్యక్షులు కూరగాయల సంతోష్‌కుమార్, మురికి శ్రీని వాస్, ఆర్య వైశ్య వాసవీ సేవాదళ్ అధ్యక్షులు ముత్యపు రమేష్, ఆర్యవైశ్య, సత్రం కోశాధికారులు రంగ శంకరయ్య, జక్కు దేవేందర్, ఆర్యవైశ్య జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు జక్కు పద్మ, నాయకురాలు ముత్యపు రాధిక, జక్కు శ్రీదేవి, అక్కెనపెల్లి జయలక్ష్మి, రంగ మంజుల గందె పద్మ, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

జగిత్యాల టౌన్: జిల్లా కేంద్రంలోని వైశ్య భవన్‌లో ఉన్న శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత 1,009వ జయంతి వేడుకలను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కృష్ణ, ఉపాధ్యక్షుడు ప్రభాకర్ ఉన్నారు.

రాయికల్: వాసవి మాత జయంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని వాసవి మాత ఆలయంలో శనివారం అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గంప ఆనందం, పిప్పరి గంగాధర్, అశోక్, లింగ శ్రీను, కూరగాయల రవి, చింత శివ కుమార్, సుజాత, శ్రీదేవి, కవిత పాల్గొన్నారు.



ధర్మపురిలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

చెట్టు పైనుంచి పడి జీపీ కార్మికుడికి గాయాలు

కరీంనగర్ రూరల్, మే 18: కరీంనగర్ మండలంలోని బొమ్మకల్ గ్రామంలో చెట్టు పైనుంచి పడి పంచాయతీ కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం విద్యుత్ తీగెలకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగిస్తుండగా పంచాయతీ కార్మికుడు ర్యాకం శంకర్ చెట్టు పైనుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే శంకర్‌ను చికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

30 నుంచి పెద్ద హనుమాన్ జయంత్యుత్సవాలు

● ఇంకా ఏర్పాటు కాని సమన్వయ సమావేశం

మల్యాల, మే 18: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో ఈ నెల 30 నుంచి మూడు రోజుల పాటు జరిగే హనుమాన్ పెద్ద జయంత్యుత్సవాలు జరుగనుండగా అందుకు తగిన ఏర్పాట్లకు ప్రతి ఏటా నిర్వహించే సమన్వయ సమావేశం ఇంత వరకు నిర్వహించలేదు. దీంతో జయంతి ఏర్పాట్లపై ఎవరికి వారే అన్న తీరుగా మారుతుంది. ప్రతి ఏటా జయంత్యుత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు కొండగట్టు వస్తుంటారు. దీనికి పదిహేను రోజులకు ముందుగానే ఎమ్మెల్యే, కలెక్టర్, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నత అధికారులతో ఏర్పాట్లకు సంబంధించిన అంశాలపై చర్చించి తగు చర్యలు చేపట్టడానికి సమన్వయ సమావేశం ఏర్పాటు చేస్తుంటారు. అయితే పెద్ద జయంతి వేడుకలకు మరో పది రోజుల గడువు మాత్రమే ఉంది. ఆలయానికి రంగులు వేసే పనులు మాత్రమే చేపట్టగా సమన్వయ సమావేశానికి ఏర్పాట్లు చేయలేదు. ఉత్సవాల సందర్భంగా పోలీసు, పంచాయతీ, రెవెన్యూ, మిషన్ భగీరథ, ఆర్టీసీ, ఫైర్, నీటి పారుదల శాఖ తదితర శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించనుండగా ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి కేటాయించిన పనులలో ఇది వరకే నిమగ్నం కావాల్సి ఉంది. గత చిన్న జయంతి ఏర్పాట్లే ఇప్పుడు కొనసాగించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నప్పటికీ ఉత్సవాల సందర్భాలలో ప్రతి ఏటా భక్తులకు ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తగు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



విద్యార్థులతో వీసీ సంకశాల మల్లేశ్

వేములవాడ టౌన్, మే 18 : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఆ దిశగా కృషి చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి సంకశాల మల్లేశ్ విద్యార్థులకు సూచించారు. వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన బంగారు పతకాల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నిరంతరం సాధన చేస్తే తప్పక లక్ష్యాలని సాధించవచ్చన్నారు.ప్రతి విద్యార్థి రోజుకు కనీసం ఐద నుండి ఆరు గంటలు సాధన చేస్తే లక్ష్యాన్ని చేరుకోగలరన్నారు. నేటి యువత టీవి, సెల్‌ఫోన్, సినిమా వంటి మాధ్యమాలకి బానిసలు కావడం బాధాకరమని, వాటిని విద్యార్థులు కేవలం తమ విద్య, విజ్ఞానం, వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడానికి మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. రానున్న పీజీ ప్రవేశ పరీక్షలు, ఉద్యోగ పోటీ పరీక్షలలో విజయం సాధించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకుని దానికనుగుణంగా సన్నద్ధం కావాలని సూచించారు. 2020-23 సంవత్సరానికి గాను అకాడమిక్ పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు పున్నశాస్త్రి, సనా, అరుణ్, మేహ, నందిని, రేవతి, రిషీంద్ర, కేజీయా, రజిత, సౌజన్య, సౌమ్య, భార్గవి, రాజు, రఘు, అజయ్, అనిల్‌లకు బంగారు పతకాలను అందజేశారు. ఈ సమావేశంలో టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారి సురేందర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్, అకాడమిక్ కోఆర్డినేటర్ మధురాజేశ్ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు వి. రాధాకృష్ణమాచార్యులు, కార్యదర్శి గడ్డం సత్యనారాయణరెడ్డి, పరుశు రాములు, జయవర్ధన్ జగన్నాథచార్యులు తదితరులు ఉన్నారు.

శతాధిక వృద్ధుడి మృతి

కోనరావుపేట, మే 18 : కోనరావుపేట మండలం మల్కాపేట గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు గెంటె రాములు (102) శనివారం మృతి చెందాడు. రాములు ఆరోగ్యంగా ఉంటూ తన పని తాను చేసుకునేవాడు. వారం రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. రామయ్యకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

నాచుపల్లి జేఎన్‌టీయూకు ఐఎస్‌వో గుర్తింపు

కొడిమ్యాల, మే 18: కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్‌టీయూ యుసీఈజే(అటానమస్)ఇంజనీరింగ్ కళాశాలకు ఐఎస్‌వో (ఇంటర్ నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డ్జేషన్)గుర్తింపు లభించింది. హైదరాబాద్ జేఎన్‌టీయూ కార్యాలయంలో శనివారం కళాశాల ప్రిన్సిపాల్ కామాక్షిప్రసాద్ హైదరాబాదు జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ డా.. కె. వెంకటేశ్వర్‌రావు సమక్షంలో సర్టిఫికెట్‌ను అందించారు. ఈ నెల 15న హెచ్‌వైఎం ఇంటర్‌నేషనల్ సర్టిఫికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు జేఎన్‌టీయూ కళాశాలను సందర్శించి సంబంధిత డాక్యుమెంట్లను పరిశీలించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 2027 వరకు గుర్తింపు ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా.. టి. వేణుగోపాల్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ జి. దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

పురుగులమందు తాగిన యువకుడి మృతి

కరీంనగర్ క్రైం, మే 18 : మద్యం మత్తులో పురుగుల మందు తాగిన మంద నరేష్(38) అనే యువకుడు హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కరీంనగర్ ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌లోని కాపువాడకు చెందిన నరేష్ మద్యానికి బానిసగా మారటంతో అతని భార్య పుట్టింటికి వెళ్లి కాపురానికి రావటంలేదు. దీంతో మనస్తాపం చెందిన నరేష్ ఈ నెల 4న మద్యంలో పురుగుల మందు కలిపి తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పురుగుల మందు డబ్బాతో యువకుడి ఆత్మహత్యాయత్నం



బాధితుడితో మాట్లాడుతున్న పోలీసులు

చందుర్తి, మే 18: ఆరు నెలలుగా పోలీసులు వేధిస్తున్నారంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఎన్గల్ గ్రామానికి చెందిన మ్యాకల జలేందర్ అనే యువకుడు శనివారం పురుగుల మందు డబ్బాతో వచ్చి ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడి కథనం ప్రకారం.. చందుర్తి మండలంలోని ఎన్గల్ గ్రామానికి చెందిన మ్యాకల జలేందర్‌కు అదే గ్రామానికి చెందిన మల్లేశంకు ఆరు నెలలుగా ఇళ్ల స్థలాల సరిహద్దు వివాదం కొనసాగుతోంది. జలేందర్‌ను పలుమార్లు పోలీస్ స్టేషన్‌కు పిలిచి కేసు నమోదు చేస్తామంటూ పోలీసులు వేధిస్తున్నారంటూ ఏప్రిల్ 8న ఎస్పీని కలిశాడు. విచారణ చేపట్టాలని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లును ఎస్పీ ఆదేశించారు. విచారణ చేపట్టిన సీఐ ఎవరి హద్దుల్లో వారే ఉండాలన్నారు. మల్లేశం వెళ్లి ఫిర్యాదు చేయడంతో పిలిపించి ఇబ్బందులు పెడుతున్నారని, తాను ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని జలేందర్ వాపోయాడు. శనివారం నిర్మాణం కోసం వివాదంలో ఉన్న స్థలంలో మల్లేశం ఇసుక పోయించాడు. దీంతో జలేందర్ తన తల్లి ఎల్లవ్వతో, చెల్లె పావనితో కలిసి పురుగుల మందు డబ్బాను వెంట తీసుకుని ఠాణాకు వెళ్లాడు. ఆత్మహత్యకు యత్నించగా అనుమానం వచ్చి అక్కడే ఉన్న హెడ్‌కానిస్టేబుల్ రంగస్వామి అడ్డుకున్నారు. అనంతరం చందుర్తి సీఐ హామీతో బాధితుడి కుటుంబ సభ్యులు వెనుదిరిగారు. ఈ విషయమై చందుర్తి ఎస్ఐ శ్రీకాంత్‌ను వివరణ కోరగా తాను జలేందర్‌ను స్టేషన్‌కు పిలిపించలేదని గంగాధర్ అనే వ్యక్తి ఠాణాకు వచ్చి పురుగుల మందు డబ్బాతో బెదిరించాడని వివరించారు.

'ఎప్‌సెట్'-24లో 'అల్ఫోర్స్' విద్యార్థుల ఘన విజయం

కరీంనగర్ టౌన్, మే 18: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎప్‌సెట్) ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత ఫలితాలతో ఘన విజయం సాధించారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డి హర్షం వ్యక్త ంచేశారు. శనివారం ఎప్‌సెట్‌లో అద్భుత ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈసందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యార్థులు వి.హాసిని 114వ ర్యాంకు, ఎన్.హేమంత్ 157, జి.శ్రీహాస్ 166, కె.సుప్రియ 296, ఎన్.జ్ఞానద 480, వి.శ్రీముఖి 568, ఎం.వర్షిత్ 575, జి.సాయిమంజునాథ్‌రెడ్డి 610, పి.జ్యోతిర్మయిరెడ్డి 863, శ్రీవెన్నెల 876, తేజస్విని 942, ఏ.శివవరుణ్ 973, సిహెచ్.అనూహ్య 950, పి.శ్రీనాథ్ 986, మలిహాఫాతిమా 992వ ర్యాంకు సాధించారని అన్నారు. 16 మంది విద్యార్థులు 1,000లోపు ర్యాంకు సాధించడం విశేషమని అన్నారు. 29 మంది విద్యార్థులు 2వేలలోపు, 63 మంది విద్యార్థులు 3వేలలోపు, 116 మంది విద్యార్థులు 5వేలలోపు ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిప్రతిష్ఠలను నిలబెట్టారని అన్నారు. తక్కువ మంది విద్యార్థులతో అత్యధిక అత్యుద్భుత ర్యాంకులు సాధించడం అల్ఫోర్స్‌కు మాత్రమే సాధ్యమని ఈ ఫలితాలు నిదర్శనమని అన్నారు. ఇటీవల ప్రకటించిన ఐఐటీ మెయిన్ ఫలితాల్లో కూడా అల్ఫోర్స్ విద్యార్థులు. 450 మంది ఐఐటీ అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. ఎప్‌సెట్-24 ఫలితాల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్రమంలో ఆల్ఫోర్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి

'ఎప్‌సెట్'-24 ఫలితాల్లో ట్రినిటీ విద్యార్థుల జయకేతనం

కరీంనగర్ టౌన్, మే 18: ఎప్‌సెట్-24 ఫలితాల్లో ట్రినిటీ జూనియర్ కళాశాలల విద్యార్థులు అద్భుత ఫలితాలతో విజయకేతనం ఎగురవేశారు. శనివారం రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను స్థానిక ట్రినిటీ కళాశాలలో ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక చైర్మన్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ట్రినిటీలో విద్యనభ్యసించిన హానికర్ అత్యుత్తమ ర్యాంకు 44 సాధించారని అన్నారు. అలాగే వివిధ విభాగాల్లో పి.ప్రణయ్ 773వ ర్యాంకు, వై.అవ్లేష 1254, వి.శ్రీతేజ 1255, వై.అశ్విత 1551, సిహెచ్.విగ్నేష్ 1624, ఆయేషా మహజబీన్ 1627, ఫిల్జాఅతిక్ 1748, ఎస్.శ్రీలక్ష్మి 2159, ఎం.హర్షవర్ధన్ 2280, ఎన్.గంగశ్రీ 2372, పి.శ్రీదీప 2682, సిహెచ్.రంజిత 2815, మబిహా ఫాతిమా 2913 ర్యాంకులు సాధించారని అన్నారు. అలాగే ఎం.ఆశీష్ 2954, కె.రాణి 2996, వి.నాగజ్యోతి 3059, ఎ.అర్షిత 3266, పి.స్మరణీ 3502, అంశారా సహర్ష్ 3877, అతిఫా ఫాతిమా 4012, ఎల్.ప్రతిమ 4101, బుష్రా బమాన్ 4255, బి.వైష్ణవి 4302, జి.దివ్య 4422, పి.హంసిని 4609, జె.కీర్తన 5041, ఎన్.దేవిక కృష్ణన్ 5050, బి.శుతి 5060, కె.అర్చన 5225, పి.జ్యోతిప్రకాశ్ 5267, సిహెచ్.సాయి మోహిత్‌రెడ్డి 5343, కె.సాయి ప్రద్యుమ్న ఆచార్య 6288, జె.హేమశ్రీ 6655, ఎల్.గణేశ్ 6729, సిహెచ్.జాన్ 7578, ఆర్.లక్ష్మిప్రసన్న 7675, రతన్‌కుమార్ 7757 పి.దుర్గాభవాని 8016, ఎ.సాహిత్య 8273, కె.శశాంక్ 8329, ఎ.వైష్ణవి 8415, డి.అలేఖ్య 8473, బి.కార్తీక్ 8580, పి.వినయ్ 9342, కె.శరణ్య 9591, ఎన్.స్నేహిత 9757 ర్యాంకులు సాధించారని తెలిపారు.


విద్యార్థులను అభినందిస్తున్న విద్యాసంస్థల ఫౌండర్ చైర్మన్ మనోహర్‌రెడ్డి

ధాన్యం కొనాలని రాస్తారోకో

బీర్‌పూర్, మే 18: కొనుగోలు కేంద్రాలలో కుప్పలు కుప్పలుగా పేరుకు పోయిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని శనివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో శనివారం రాస్తారోకో చేపట్టారు. బీర్‌పూర్ మండలంలోని కందెనకుంట సమీపంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని నర్సింహులపల్లి, కందెనకుంటకు చెందిన రైతులు నర్సింహులపల్లి శ్రీకృష్ణ యాదవ సంఘం సమీపంలో ప్రధాన రహదారిపె బైఠాయించి సుమారుగా గంటపాటు రాస్తారోకో చేశారు. రైతుల రాస్థా రోకో కారణంగా ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచి పోయాయి. ఈ సందర్భంగా రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు మాట్లాడుతూ అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యంలో కోతలు విధించకుండా చూడాలని, అంతే కాకుండా అన్ని రకాల ధాన్యానికి 500 రూపాయలు బోనస్ చెల్లించి నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, మాజీ జడ్పీటీసీ కొల్కుల రమణ, బీఆర్‌ఎస్ మండల ప్రధానకార్యదర్శి శీలం రమేష్, నాయకులు మెరుగు రాజేశం, శీలం రవిందర్, సుశీన్, తాడుక మల్లేశం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు


దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా చందనోత్సవం

- ఆరో రోజూ ప్రత్యేక పూజలు
- పెద్ద సంఖ్యలో భక్తుల రాక

ధర్మపురి, మే 18: ధర్మపురి లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో నరసింహ నవరాత్రోత్సవాల్లో భాగంగా శనివారం చందనోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నెల 13 నుంచి ప్రారంభమైన నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరవ రోజు ఉదయం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ముఖ్య అర్చకులు స్వామి వారలకు పురుషసూక్త, శ్రీసూక్త, కల్పోక్త, న్యాసపూర్వక, షోడశ ఉపచార పూజ, సహస్ర నామార్చన నిర్వహించారు. పంచోపనిషత్తులచే మన్యసూక్త, రుద్రాభిషేకం, విశేష పూజలు, సప్త హారతులు, భజనా కార్యక్రమాలు నిర్వహించారు. యోగ, ఉగ్ర నారసింహులను అందంగా చందనంతో అలంకరించారు. అలాగే లోక కల్యాణార్థం నిత్యం సుదర్శన, నారసింహ, రుద్ర హోమాలు నిర్వహించారు. గోదావరిలో స్నానాలు చేసిన భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


సమ్మయ్య(ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, మే 18: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామంలో సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని శనివారం వెనుక నుంచి ఓ వాహనం అతివేగంగా వచ్చి వేగంగా ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. చెల్పూర్ గ్రామానికి చెందిన మండల సమ్మయ్య(55) తన పనుల నిమిత్తం సైకిల్‌పై ఇందిరానగర్‌కు వెళ్లాడు. పనులు ముగించుకొని స్వగ్రామానికి సైకిల్‌పై వస్తున్న క్రమంలో జమ్మికుంట నుంచి హుజూరాబాద్ వైపు వస్తున్న వాహనం వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

ప్రేమ పేరుతో మోసం చేసిన యువతిపై కేసు

తిమ్మాపూర్(మానకొండూర్) మే 18: ప్రేమ పేరుతో డబ్బులు దండుకొని ఆస్ట్రేలియాకు వెళ్లిన ఓ యువతిపై ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం,, తిమ్మాపూర్‌కు చెందిన మాదన నాగరాజు అనే యువకుడు యోగా నిమిత్తం ఈశా ఫౌండేషన్‌కు వెళ్లాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నంకు చెందిన కమల సంధ్య ప్రియాంకతో నాగరాజుకు పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. కొద్ది నెలల క్రితం వీరిద్దరు తిమ్మాపూర్‌కు రాగా నాగరాజు తండ్రి మల్లయ్య ఇంట్లోకి రానివ్వలేదు. దీంతో అదే గ్రామంలోని ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నారు.. కాగా నాగరాజు ఓ ఆసుపత్రిలో తన పేరున ఉన్న భాగస్వామ్యంను రద్దు చేసుకోవడంతో రూ. 16లక్షలు వచ్చినట్లు తెలిపారు. ఆ మొత్తాన్ని ప్రియాంక తన బంధువుల అకౌంట్లోకి ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నది. అనంతరం ఆస్ట్రేలియాకు వెళ్లి మూడు లక్షలతో పాటు నాగరాజు వాటా ఇస్తేనే పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో తన కుమారుడు తనను భూమి కోసం తండ్రిని వేధిస్తున్నట్లు తెలిపారు. కొంత కాలానికి ప్రియురాలు మోసం చేసిందని తీవ్ర మనస్తాపానికి గురై ఫినాయిల్ తాగి ఆసుపత్రిలో చికిత్స పొందున్నతున్నాడు. నాగరాజు తండ్రి మల్లయ్య పిర్యాదు మేరకు కమల సంధ్య ప్రయాంకపై శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, మే 18: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని పాత బస్టాండులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని తిమ్మాపూర్‌కు చెందిన తేజస్వినికి అనే యువతికి తీవ్ర గాయాలయ్యాయి. తిమ్మాపూర్‌కు చెందిన యువకుడు తేజ తన తల్లి కరికె వనిత, సోదరి తేజస్వినితో కలిసి బైక్‌పై మండల కేంద్రం మీదుగా వెళ్తున్నాడు. నారాయణపూర్‌కు చెందిన యువకుడు ఇర్ఫాన్ తన జీపుతో బైక్‌ను ఢీకొట్టాడు. ఘటనలో తేజస్వినికి తీవ్ర గాయాలవగా తేజ, వనిత స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తేజస్విని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

మెట్‌పల్లి రూరల్, మే 18: మండలంలోని వేంపేట గ్రామంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా జరిపారు. శనివారం ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పురోహితుడు వామన చక్రపాణి ఆధ్వర్యంలో పురోహితులు వేదమంత్రోచ్చారణలతో బాజా భజంత్రీల మధ్య అంగరంగ వైభ వంగా కల్యాణం జరిపారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్‌రావు, కృష్ణారావులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి కల్యాణంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమం లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, తిప్పిరెడ్డి అంజిరెడ్డి, జెట్టి లింగం, నాయకులు కొమ్ముల రాజేశ్వర్‌రెడ్డి, మామాడి నారాయణరెడ్డి, గోరుమం తుల ప్రవీణ్ కుమార్, కల్లెడ గంగాధర్, ఏలేటి వినోద్, చిలువేరి నరేందర్, రాజేందర్, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


వేంపేటలో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం

కథలాపూర్, మే 18 : మండలంలోని దుంపెటలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారల కల్యాణం అర్చకులు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల మొదటి రోజు కావడంతో పంచామృత అభిషేకాలు, పుష్పార్చన, మంగళహారతి, మంత్ర పుష్పం, విశేష పూజలు నిర్వహించారు. వేద పండితులు నారంభట్ల వామనశర్మ, హరిప్రసాద్‌శర్మ, గిరధర్ శర్మ, భరద్వాజ్, రాజుశర్మ నేతృత్వంలో కల్యాణం కమనీయంగా జరిగింది. విశ్వక్సేన ఆరాధన, మహా గణపతి పూజ, పుణ్యాహవచనం, గౌరీపూజ, అంకురారోపణ, ఎదురుకోలు, గరుడ వాహన పూజ, విశేష హవనాలు వంటి కార్యక్రమాలు జరిపారు. కళ్యాణం వీక్షించేందుకు చుట్టు పక్కన గ్రామాల నుంచి మహిళలు తర లివచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, మే 18: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించు కున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా ఎండ తీవ్రతతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. వందలాదిగా భక్తులు స్వామి వారి సన్నిధిలో హనుమాన్ దీక్ష తీసుకున్నారు. భక్తులకు కావల్సిన ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవే క్షించారు. గదుల కొరతతో భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురి అయ్యారు. రా త్రులు ఆరుబయటనే నిద్రించారు.


కొండగట్టులో భక్తుల సందడి

నూతన చట్టాలపై అవగాహన కల్పించాలి

- డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వెంకటేశ్వర్లు

కరీంనగర్ లీగల్, మే 18: కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసిన మార్పులు, చేర్పులతో ప్రవేశపెట్టిన నూతన చట్టాలపై అవగాహన కల్పించాల్సిన అవసరముందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వింజమూరి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం తెలంగాణ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్త అడిషనల్, అ సిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వింజమూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతీ మొదటి శనివారం పోలీస్ అధికారుల సమీక్షా సమావేశంలో వారికి నూతన చట్టాలపై అవగాహన కల్పించాలని, ప్రతి మూడో శనివారం ప్రాసిక్యూటర్ల సమావేశంలో కూడా వాటిపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రాసిక్యూటర్లు కేసుల విచారణ సమయంలో ఆయా కేసుల పూర్తి అవగాహనతో ఉండాలని, సంబంధిత న్యాయమూర్తులతో సమన్వయంతో కలిసి వెళ్లాలని అన్నారు. అనంతరం కరీంనగర్ అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీరస్వామి నూతన చట్టాలను వివరించారు. సమావేశంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు జ్యోతిరెడ్డి, నర్సింగారావు, తుమికి పవన్‌కుమార్, జూలురు శ్రీరాములు, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, శరత్, పెంట శ్రీనివాస్, కాసారం మల్లేశం, జంగిలి మల్లికార్జున్, సీనియర్ ఏపీపీ మురళీధర్‌రావు, వసంత తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

మందమర్రిటౌన్, మే 18: పట్టణంలోని రాష్ట్రీయ రహదారి జీఎం కార్యాలయం వెళ్లే రోడ్డు వద్ద శనివారం రాత్రి వాహనం ఢీకొని కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని వావిలాల గ్రామానికి చెందిన కుంబం రాధమ్మ (60) అక్కడికక్కడే మృతిచెందింది. రాధమ్మ మందమర్రిలోని కూతురును చూసేందుకు జమ్మికుంట నుంచి మందమర్రికి వచ్చింది. మందమర్రిలో బస్సు దిగి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా బెల్లంపల్లి వైపు నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న ఓ వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయాలై మృతి చెందింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుం బీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రెస్టారెంట్, టిఫిన్ సెంటర్లపై సివిల్ సప్లై అధికారుల దాడులు


డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న అధికారులు

కరీంనగర్ మే 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ పట్టణంలో పలు హోటల్స్, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లల్లో శనివారం సివిల్ సప్లై అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్‌లలో అక్రమంగా వినియోగిస్తున్న డొమెస్టిక్ (గృహావసరాల) సిలిండర్లను వాడుతున్నట్లు అధికారులు గుర్తించారు. సిలిండర్లను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ప్రభుత్వం గృహలక్ష్మీ పథకంలో భాగంగా 500రూపాయలకే లబ్ధిదారులకు సిలిండ్‌లను అందజేస్తోంది. గృహ అవసరాలకు అందించే సిలిండర్ ధర 1000రూపాయలు ఉండగా అందులో కొన్ని గృహలక్ష్మీ పథకం కింద 500రూపాయలకే అందిస్తోంది. కమర్షియల్ సిలిండర్ 2,300 రూపాయలకు మార్కెట్ ధర ఉంది. అయితే సిలిండ్‌లు కాస్తా పక్కదారి పట్టి హోటళ్లు, రెస్టారెంట్‌లు, టిఫిన్ సెంటర్ల నిర్వహకులు డొమెస్టిక్ సిలిండర్‌లను ఉపయోగిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి లక్షల్లో గండిపడటమే కాకుండా పేదల కోసం ప్రవేశపెట్టిన గృహలక్ష్మీ పథకం లబ్ధిదారులకు నష్టం వాటిల్లుతుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సివిల్ సప్లై అధికారి సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం హోటళ్లు, రెస్టారెంట్‌లు, టిఫిన్ సెంటర్లపై దాడులు నిర్వహించి 96 సిలిండర్‌లను సీజ్ చేసినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి సురేష్‌రెడ్డి తెలిపారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు. గృహ అవసరాలకు వాడాల్సిన సిలిండర్లను కమర్షియల్‌కు ఉపయోగిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి సురేష్‌రెడ్డి తెలిపారు.

ఇసుక రీచ్‌ను అడ్డుకున్న రైతులు


మామిడిపల్లిలో అడ్డుకున్న రైతులు

కోనరావుపేట, మే 18: కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను శనివారం రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ వల్ల భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని అన్నారు. కొంతమంది ఇసుకను తోడేస్తున్నారని అక్రమంగా తరలించి కూడా అమ్ముకుంటున్నారని అన్నారు. ఇసుక రీచ్‌ను మామిడిపల్లిలో బంద్ చేసి వేరే చోట ఇవ్వాలని అన్నారు. విషయం తెలుసుకున్న కోనరావుపేట ఆర్ఐ రాజశేఖర్ చేరుకొని రైతులతో మాట్లాడి లోతుగా తీయకుండా మరోచోట ఇస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఇసుక రీచ్‌ను నడవనిచ్చారు.

చిరుత దాడిలో దూడ మృతి

రుద్రంగి, మే 18: రుద్రంగి మండల కేంద్రంలో చిరుత దాడిలో దూడ మృతి చెందింది. మండల కేంద్రానికి ద్రానికి చెందిన చిట్టపురం గంగాధర్ ఆనే రైతు నల్లగుట్ట ప్రాంతంలోని గోరిలాల్వ దగ్గర తన పొలం వద్ద రోజు మాదిరిగానే దూడను కట్టేశాడు. ఉదయం పోలం వద్దకు వేళ్లి చూసే సరికి దూడ మృతి చెంది ఉందని, చిరుతపులి ఆనవాళ్లు ఉండడంతో రాత్రి సమయంలో చిరుత పులి దాడి చేసి దూడను చంపిందని భాదిత రైతు తెలిపాడు. నల్లగుట్ట ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తుండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు.

అష్ట కష్టాలు

- డబుల్ బెడ్‌రూం ఇళ్లలో సౌకర్యాలు నిల్
- ఉండలేక తాళాలు వేసిన వెళ్తున్న లబ్ధిదారులు



పోతారం గణేశ్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు

సారంగాపూర్, మే 18: అక్కడ తాగునీటి సౌకర్యం ఉండదు.. విద్యుత్ సౌకర్యం అసలే లేదు. ఇక డ్రెయినేజీ నిర్మాణం పూర్తి కాక ఇళ్ల మధ్యనే ఆ మురుగు పారుతూ ఉంటుంది. ఆఘమేఘాల మీద ఇళ్లు నిర్మించినా అంతర్గత రహదారులు మాత్రం ఇప్పటికీ దిక్కు లేదు. ఇదంతా సారంగాపూర్ మండలంలోని పోతారం గ్రామంలో గల గణేష్‌పల్లిలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పరిస్థితి. కనీస వసతులు లేకున్నా కొందరు తప్పని పరిస్థితుల్లో ఆ ఇళ్లలోనూ ఉంటున్నా మరి కొందరైతే తాము ఇక్కడ ఉండలేమంటూ ఊరికి దగ్గరగానే అద్దె గదుల్లో ఉంటున్నారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాన పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా సారంగాపూర్ మండలంలోని పోతారం గ్రామంలో గల గణేష్‌పల్లిలో 20 ఇళ్లు నిర్మించారు. వీటిని టాటరీ పద్ధతిలో గత సంవత్సరం లబ్ధిదారులకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఇళ్లు మాత్రం పంపిణీ చేశారు కానీ వాటిల్లో కనీస సౌకర్యాలు మాత్రం కల్పించలేకపోయారు. డబుల్ బెడ్ రూం ఇళ్లలో అసౌకర్యాల మధ్యనే లబ్ధిదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో ప్రధాన రహదారి నుంచి తీగలు లాగి ఇళ్లలో అమర్చుకున్నారు. దీంతో గాలి వానకు తీగలు తెగిపోవడంలో కరెంట్ అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉంది. తాగునీటి సౌకర్యం లేక సమీపంలో ఉన్న బోరు బావుల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. మిషన్ బగీరథ నీరు వస్తున్నా అది కూడా మూడు రోజులకు ఒక సారి రావడంతో తాగు నీటికి తిప్పలు తప్పడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. మురుగు నీరు కాలువలో నిలిచి పోవిడంతో దోమల బెడద తీవ్రమైంది. దీంతో నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తుందని లబ్ధి దారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్లు నిర్మించి ఏళ్లు గడిచినా సీసీ రహదారుల నిర్మాణాలు ఇప్పటికీ లేకపోవడం గమనార్హం. వర్షాకాలం వచ్చిందంటే చాలు ఇక్కట్లు మరింత పెరుగుతాయిఇ. ఇళ్ల ముందే వర్షపు నీరు నిలవడం, డ్రెయినేజీల్లో నిరు నిండి దుర్గంధం వెదజల్లడం వంటి సమస్యలతో లబ్ధిదారులు ఉండలేకపోతున్నారు. వసతులు లేకపోవడంతో లబ్ధి దారులు ఇళ్లకు తాళాలు వేసి వెళ్లి పోతున్నారు. నిలువ నీడ లేని కొంత మంది మాత్రం అక్కడే ఉంటూ కాలం వెల్లదీస్తున్నారు. పూర్తి స్థాయిలో వసతులు కల్పించేందుకు రూ. 25లక్షలతో విద్యుత్, మంచినీటి సదుపాయం, రహదారుల నిర్మాణంతో పాటు మరిన్ని వసతులు కల్పించేందుకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నిధులు మంజూరు కాక సమస్యలతో సహవాసం చేయల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పూర్తి చేయని డ్రెయినేజీ

కరెంట్ సౌకర్యం ఏర్పాటు చేయాలి..



కరెంట్ సౌకర్యం లేక పోవడంలో రోడ్డు నంచి తీగలు లాగి అమర్చుకున్నాం. గాలి వచ్చినప్పుడు కరెంట్ పోతుంది. దీంతో చీకట్లో ఉండాల్సిన పరిస్థితి వస్తోంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. సౌకర్యాలు కల్పించేలా చూడాలి. - సంద్రుగుల లక్ష్మి

నీరు రావడం లేదు.



నీటి సౌకర్యం లేక చపోవడంలో సమీపంలో ఉన్న బోరు బావుల వద్దకు వెళ్తున్నాం. మిషన్ బగీరథ నీరు సక్రమంగా రావడం లేదు. తాగు నీటికి కొరత ఉండటంతో పొదుపుగా వాడు కుంటున్నాం. అధికారులు స్పందించి వసతులు కల్పించాలి. - రాజవ్వ

రాష్ట్రంలో ఉన్నది రైతు ప్రభుత్వం

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

మెట్‌పల్లి రూరల్, మే, 18 : తెలంగాణ రాష్ట్రంలో ఉన్నది రైతు ప్రభుత్వం అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. శనివారం మండలంలోని వేంపేటలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పోసిన కుప్పలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గతంలో బీఆర్ఎస్ హయాంలో తప్ప తాలు పేరుతో రైతులను నిండా ముంచి, రైస్ మిల్లర్లకు లాభం చేసి కమిషన్లు దండుకున్నారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో తప్ప తాలు కటింగ్ లేకుండా కొన్న ధాన్యానికి మూడు రోజుల్లో రైతు ఖాతాల్లో డబ్బు జమ చేయడం జరుగుతోందన్నారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు తిప్పిరెడ్డి అంజిరెడ్డి, పట్టణాధ్యక్షుడు జెట్టి లింగం, జెట్టి లక్ష్మణ్, వెల్మ రాజారెడ్డి, ఏనుగు బుచ్చిరెడ్డి, కొట్టాల జీవన్, పెంటపర్తి శ్రీనివాస్,పల్లి శేఖర్, ఏలేటి రాజారెడ్డి, గడ్డ సాయిరెడ్డి ఉన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవం

మెట్‌పల్లి రూరల్, మే, 18 : మండలంలోని ఆత్మనగర్ గ్రామంలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణాన్ని నిర్వాహకులు ఘనంగా జరిపించారు. శనివారం ఆయలంలోని స్వామి వారికి పురోహితులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, హారతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గడ్డె నరహరి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆత్మకూర్, ఆత్మనగర్ గ్రామల విశ్వబ్రహ్మణ సంఘంతో పురోహితులు వేదమంత్రత్సోవాల మధ్య స్వామి వారి కల్యాణాన్ని జరిపారు. అధిక సంఖ్యలో పాల్గొని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. భక్తులకు గడ్డె నరహరి అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూర్, ఆత్మనగర్ గ్రామల విశ్వబ్రహ్మణ సంఘం నాయకులు, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జగిత్యాల టౌన్: జిల్లా కేంద్రంలోని పురాణీ పేటలో ఉన్న విశ్వకర్మ సత్సంగ్ భవన్‌లో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవ సమాధి అయిన వైశాఖ శుద్ధ దశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. భజన కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మంగారి చరిత్ర నాటక ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు వంగళ బాస్కరా చారి, టీవీ సత్యం ఉన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం

విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

బుగ్గారం మే 18:మండలంలోని గోపులపూర్ గ్రామానికి చెందిన విటి శ్రీనివాస్,దీటి మహేష్‌లు మృతి చెందగా వారి కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భరోసా ఇచ్చారు.శుక్రవారం కర్రల దాడిలో మృతి చెందిన విషయం తెలుసుకున్న విప్,ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ శనివారం శ్రీనివాస్,మహేష్‌ల పార్థివ దేహాలకు నివాళులు అర్పించి ప్రగాడ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా శ్రీనివాస్,మహేష్ కుటుంబాలకు 20వేల ఆర్థిక సహాయం అందజేశారు. బాధిత కుటుంబాలకు భవిష్యత్తులో సహాయ పడుతామని లక్ష్మణ్ కుమార్ హామి ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్, జడ్పీటీసీ బాదినేని రాజేందర్, ఉపాధ్యక్షుడు నగునూరి నర్సగౌడ్, యూత్ మండల అధ్యక్షుడు బీరుపురి తిరుపతి, నాయకులు సిగిరి అంజిత్, కండ్లే మధన్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్



మెట్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ అధికారులు, కళాబృందం

మెట్‌పల్లి, మే, 18 : ఇంటి, పరిసరాల పరిశుభ్రత ఉంచడం మన అందరి బాధ్యతని మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ అన్నారు. జిల్లా కలెక్టర్ యాస్మిన్‌బాష ఆదేశాల మేరకు పౌర సంబంధాల శాఖ వారి నేతృత్వంలో పారిశుధ్యంపై శనివారం పట్టణంలోని బస్ డిపో, చావిడి, కొత్తబస్టాండ్‌ల వద్ద కళాబృందాలతో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టణంలోని ప్రజలు తమ ఇంటి, వ్యాపార సంస్థలలోని చెత్తను రోడ్లపై, మురికి కాలు వలలో వెయకుండా మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు. వర్షాకాలం ప్రతీ ఒక్కరు తమ ఇంటి, పరిసరాలల్లో మురికి నీరు నిల్వ ఉండకుండా, నిల్వ నీటిలో బ్లీచింగ్ పౌడర్‌ను చల్లడం వలన దోమలను నివారణ చేయాలన్నారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులు ఎండలో పనులు చేయకుండా నీడ పట్టున చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్, నిజాం, అశోక్, నరేష్, కళాబృందాలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్



క్రీడా సామగ్రిని అందజేస్తున్న నిర్వాహకులు

గొల్లపల్లి మే 18 : మండలంలోని భీంరాజ్ పల్లెలో భీంరాజ్ పల్లె బొమ్మెన కుమార్ ఆధ్వర్యంలో శనివారం క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్‌ను నిర్వాహకులతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ముస్కు నిశాంత్‌రెడ్డి ప్రారంభించారు. క్రికెట్ టీం సభ్యులకు రూ. 40 వేల విలువైన క్రీడా సామగ్రితో పాటు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. విజేతలకు నిర్వాహకులు బొమ్మెన కుమార్, బొమ్మెన ముక్తామణి ట్రోఫీని, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తాజామాజీ ప్రజా ప్రతినిధులు చిర్ర గంగాధర్, రేవెళ్లి సత్యానారాయణ, రాజ్యలక్ష్మీతిరుపతిరెడ్డి, నాయకులు రేవెళ్లి లింగయ్య, వెంకటేశం, నరేందర్ పాల్గొన్నారు.

జీలుగ కోసం రైతుల బారులు

విత్తనాలు దొరకక వెనుదిరిగిన అన్నదాతలు

కథలాపూర్, మే 18: నత్రజని, పొటాష్ వంటి పోషకాలు పుష్కలంగా లభించే జీలుగ విత్తనాల కోసం రైతులు శనివారం బారులు తీరారు. సీజన్ ఆరంభం కావడంతో రైతులు తమ పొలాల్లో విత్తనాలు చల్లుకుంటారు. ప్రభుత్వం భూషణరావుపేట ప్యాక్స్ కేంద్రానికి వెయ్యి సంచులు, ఆగ్రోస్ కేంద్రానికి 600 బ్యాగులు, తక్కళ్ళపల్లి డీసీఎంఎస్‌కు 160 బ్యాగులు మాత్రమే వచ్చాయి. డిమాండ్ అధికంగా ఉన్న నేపథ్యంలో అతి తక్కువ బ్యాగులు రావడంతో జీలుగ విత్తనాలు దొరక్క వెనుదిరిగి వెళ్లిపోయారు. సిరికొండ, గంభీర్‌పూర్ సింగిల్ విండో కార్యాలయాలకు జీలుగ కేటాయించకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 40 కిలోల సంచికి రూ. 1116లుగా ప్రభుత్వం ధర నిర్ణయించగా ఒక సంచి రెండున్నర ఎకరాలకు సరిపోతుందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. సమయం మించిపోతున్న నేపథ్యంలో రైతులు విత్తనాలు సరఫరా చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం

తంగళ్లపల్లి, మే 18: మృతుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్ హామీ ఇచ్చారు. తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్‌లోని భరత్‌నగర్‌కు చెందిన రుద్రరపు చంద్రయ్య పిడుగు పాటుతో మృతి చెందగా కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకులు పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

జిల్లెల్ల గ్రామంలో మృతి చెందిన బచ్చుపెల్లి నర్సయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేలు అందజేశారు. కాంగ్రెస్ నాయకుడు సత్తు శ్రీనివాస్‌రెడ్డి ఒక్కో కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ ఉన్నతాధికారులతో కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడారని, ఆదుకుంటామని హామీ ఇచ్చారనిని వెల్లడించారు.



గొల్లపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు

నత్తనడకన ధాన్యం కొనుగోళ్లు

- రోజుల తరబడి కేంద్రాల చుట్టూ రైతులకు తప్పని ప్రదక్షిణలు
- అన్‌లోడింగ్‌లో మిల్లర్ల జాప్యం
- లోడింగ్‌కు ఒక్కో బస్తాకు రెండు రూపాయలు వసూలు
- ఆందోళనలో రైతాంగం
- పట్టించుకోని అధికారులు

గొల్లపల్లి, మే 18: గొల్లపల్లి మండలంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు నత్త నడకన సాగుతున్నాయి. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యానికి రైతన్నలు నిండా మునుగుతున్నారు. ఆరుగాళం కష్టించి సాగు చేసిన వరి ధాన్యంను విక్రయం నిమిత్తం ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన కేంద్రాల్లో పోసి రోజుల తరబడి కేంద్రాల చుట్టూ రైతులకు ప్రదక్షిణలు తప్పడం లేదు. ఒకవైపు ఆకాశంలో మబ్బులతో ఎప్పుడు వర్షం పడుతుందోనని రైతాంగం ఆందోళన చెందుతోంది. మరోవైపు తూకం వేసిన ధాన్యం బస్తా లను మిల్లులకు తరలిస్తే మిల్లర్లు అన్ లోడింగ్ చేసుకోవడానికి తీవ్ర జాప్యం చేస్తున్నారని రైతులు, కేంద్రాల నిర్వహకులు ఆరోపిస్తున్నారు. అన్‌లో డింగ్‌లో జరుగుతున్న జాప్యంతో వెయిట్ లాస్ వస్తుందని, ఒక్కో లారీకి 7 నుంచి 9 బస్తాల దాకా వెయిట్ లాస్ వస్తుందని, ఇదంతా రైతుకు నష్టం వాటి ల్లుతుందని రైతులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే ధాన్యం బస్తాలను లారీల్లో లోడింగ్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఇంతా జరుగుతున్న సంబంధిత శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారనే ఆరోపణలున్నాయి. మండలంలో గొల్లపల్లి సింగిల్‌విండో, చెందోళి సింగిల్ విండోతో పాటు ఐకేపీ ఆధ్వర్యంలలో ధాన్యం కొనుగోళ్లు నెలరోజులుగా జరుగుతున్నాయి. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టి వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని రైతాంగం కోరుతోంది.

లారీల కొరత - బస్తాకు రూ. 2 వసూలు

మండలంలో తూకం వేసిన ధాన్యం బస్తాలను మిల్లులకు రవాణా చేయడానికి లారీల కొరత తీవ్రంగా వెంటాడుతోంది. లారీల కొరతతో తూకం వేసిన ధాన్యం బస్తాలు కేంద్రాల్లో రోజులతరబడి మూలుగుతున్నాయి. దీన్ని అదనుగా తీసుకుంటున్న కొందరు లారీల యజమానులు తమకు అనుకూలంగా ఉండే కేంద్రాలకు లారీలను తరలిస్తూ బస్తాల లోడింగ్‌కు ఒక్కో బస్తాకు రూ. 2 రైతుల నుంచి ముక్కు పిండి మరీ వసూలు చేస్తు న్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

అన్‌లోడింగ్‌లో తీవ్ర జాప్యం

ధాన్యం బస్తాలను మిల్లులకు తరలించేందుకు లారీల కొరత తీవ్రంగా వెంటాడుతుండగా, మిల్లులకు రవాణా చేసిన ధాన్యం లోడ్‌లను అన్‌లోడింగ్ చేసుకోవడంలో మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అసలే లారీల కొరతతో కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు కేంద్రాల్లో మూలుగుతుంటే, మిల్లులకు రవణా చేసిన ధాన్యం బస్తాలను అన్‌లోడింగ్ చేసుకోవడానికి నాలుగైదు రోజులు జాప్యం చేస్తున్నారని బాధిత రైతాంగం, కేంద్రాల నిర్వాహకులు వాపోతున్నారు. దీనిపై సంబంధిత శాఖ అధికారులను వివరణ కోరడానికి యత్నించగా వారు అందుబాటులో లేరు.

కమ్ముకొస్తున్న మబ్బులు

జగిత్యాల రూరల్: మూలిగేనక్కపై తాటిపండు పడ్డట్టుగా తయారైంది రైతుల పరిస్థితి. రుతుపవనాలు సమీపిస్తున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించడంతోపాటు, ఓవైపు మబ్బులు ఏర్పడి వర్షాలు కురుస్తుండంతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. వాతావరణంలో ఏర్పడుతున్న మార్పుల వల్ల ఆకాశం ఒక్కసారిగా మబ్బులు కమ్ముకుంటుడంతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జగిత్యాల రూరల్ మండలంలో ఐకేపీ సెంటర్ల లో 17 కేంద్రాల ద్వారా 1763 రైతుల వద్ద నుంచి 102070 క్వింటాళ్లను సేకరించారు. అర్బన్ మండలంలో 5 కేంద్రాల ద్వారా 482 రైతుల వద్ద నుంచి 29414 ధాన్యాన్ని సేకరించినట్లు ఐకేపీ అధికారులు పేర్కొంటున్నారు. అలాగే ప్యాక్స్ 9 సెంటర్ల ద్వారా 322 మంది రైతుల వద్ద నుంచి 20550 క్వింటాళ్లను కొనుగోలు చేసినట్లు అధికారులు తెలిపారు.

వానపడితే అంతే ...

ప్రస్తుత పరిస్థితుల్లో వర్షం వస్తే అన్నదాతకు నష్టం తప్పదు. మండలంలో ఎస్సారెస్పీ నీటికితోడు, వ్యవసాయబావుల నీటి ఆధారంగా అష్టకష్టాలుపడి పంటలు సాగుచేశారు. తీరా సమయానికి రుతుపవనాలు సమీపించి వర్షాలు రావడంతో అన్నదాతలు దిక్కుతోచనిస్థితిలో బిక్కుబిక్కు మంటున్నారు. వానాకాలంలో సాగైన వరి పైరుపై దోమపోటు సోకి దిగుబడి తగ్గి నష్టాలకు లోనయ్యారు. యాసంగిలో సాగుచేసిన వరిపంటలపై ఎకరాకు 10 వేల వరకు పెట్టుబడులు పెట్టామని రైతులు చెబుతున్నారు. కొనుగోలు సెంటర్లలో మిగిలిన ధాన్యం పట్ల లారీల కొరత వల్ల ధాన్యం సెంటర్లలోనే మగ్గుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి ధాన్యం త్వరగా మిల్లులకు తరలించేలా చొరవ తీసుకోవాలని కోరుతున్నారు.

నష్టం జరిగితే అధికారులే బాధ్యత వహించాలి



చిత్తారి ప్రభాకర్, రైతు తిప్పన్నపేట

వర్షకాలం సమీపిస్తుండం వల్ల అధికారులు ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలి. వర్షాలు వస్తాయని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఇప్పటికైనా సెంటర్లలో నిల్వ ఉన్న ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోళ్లు పూర్తి చేయాలి, గన్నీసంచులు, లారీల కొరత లేకుండా చూడాలి. సెంటర్లలో పాడీ క్లీనర్‌లు మిషన్‌లు చెడిపోతే రైతులమే బాగుచేయించాం. అధికారులు పట్టిం చుకోవడం లేదు. ధాన్యం తడిసి నష్టం జరిగితే అధికారులే బాధ్యత వహించాలి

ధాన్యం తడిస్తే ఇబ్బంది..: మ్యాడరాములు, రైతు తిప్పన్నపేట



కేంద్రాల్లో వర్షకాలం ప్రారంభమైనందువల్ల తూకాలు వేగవతంతం చేయాలి. చాలా రోజులుగా కేంద్రాల్లో ధాన్యం కుప్పలతో పాట్లుపడుతున్నాం. కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని రైతులంతా తూకం కోసం ఎదురుచూస్తున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకొని వేగవంతంగా కొనుగోళ్లను పూర్తిచేయాలి



తిప్పన్నపేట ఐకేపీ సెంటర్‌లో నిలిచిపోయిన ధాన్యం సంచులు

క్రీడలతో విద్యార్థుల నైపుణ్యం పెంపొందుతుంది

జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి

మెట్‌పల్లి, మే, 18 : విద్యార్థులు క్రీడలు ఆడడంతో వారి నైపుణ్యం పెంచడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏలేటి ముత్తయ్యరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో జరిగిన అండర్ 20 జిల్లా స్థాయి పోటీలను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. జరిగిన పోటీల్లో జిల్లాలో నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో 30 మంది క్రీడాకారులు గెలుపొందారు. గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు, ప్రశంస పత్రాలను అందేసి అభినందించారు. ఈ సంర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొదటి సారిగా చిన్నారుల నుంచి సీనియర్స్ క్రీడాకారులు పాల్గొనండం జరిగిందన్నారు. జిల్లా స్థాయిలో గెలుపొందిన విజేతలను జూన్‌లో హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశామన్నారు. క్రీడలు ఆడడంతో విద్యార్థుల శరీ దృఢత్వమే కాకుండా సాధించిన ఫలితాలు భవిష్యత్తుల్లో వారి ఉన్నత స్థాయికి వెళ్ళడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కోశాధికారి కొమురయ్య, జిల్లా ఉపధ్యాక్షుడు యాడ్లపురం అంజయ్య, గజలీ రాందాస్, వ్యాయమ ఉపాధ్యాయులు మరిపెల్లి కార్తీక్, శంకర్, భవాని, కొమురయ్య, గంగాధర్, క్రీడాకారులు, పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఏలేటి ముత్తయ్యరెడ్డి

వీరబ్రహ్మేంద్ర స్వామి రథోత్సవం

కోరుట్ల రూరల్, మే 18 : మండలంలోని చిన్నమెట్‌పల్లి గ్రామంలోని శ్రీ విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా శనివారం స్వామి వారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులు గా విశేష పూజలను విశ్వబ్రాహ్మణల సంప్రదాయ పద్ధతిలో జరిపారు. దేవాలయంలో అర్చన అభిషేకాలను జరిపి హోమం పల్లకి సేవ కార్యక్రమాలను నిర్వహించారు. చివరి రోజు వీరబ్రహ్మేంద్ర స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకం అలంకరించి రథోత్సవం జరిపారు. భక్తులు రథంను లాగుతూ మొక్కులు చెలించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

మెట్‌పల్లి,మే 18: అకాల వర్షానికి కేంద్రాల్లో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేపట్టాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట ప్రధాన కార్యదర్శి పుప్పాల లింబాద్రి డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందిన సమయంలో అకాల వర్షం రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలులో అధికారులు, నిర్వహకుల నిర్లక్ష్యం వల్లనే జాప్యం అవుతుందని, దీంతో అకాల వర్షాలు, ఈదురు గాలులు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుందన్నారు. కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యంను వెంటనే కొనుగోలు చేపట్టి రైతులను ఆదుకోవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సురాజ్, బాలరాజు, అమర్, సత్యం, పాల్గొన్నారు.

చట్టాల పై అవగాహనను పెంపొందించుకోవాలి

గొల్లపల్లి, మే 18 : చట్టాలపై ప్రజలు అవగాహనను పెంపొందించుకోవాలని జగిత్యాల కోర్టు జిల్లా రెండో అదనపు జడ్జి వినీల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం గొల్లపల్లి మండల కేంద్రంలోని రెడ్డి సంఘం భవనంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరు చట్టాల పట్ల అవగాహన కల్గి ఉండాలని, ప్రతి దానికి కోర్టు మెట్లు ఎక్కి విలువైన సమయాన్ని, డబ్బును వృధా చేసుకోవద్దన్నారు. చట్ట వ్యతిరేక పనులను చేయకూడదని, ఏమైనా సమస్యలు ఉంటే చట్టం పరిధిలో రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలన్నారు. యువత గంజాయికి బానిసలు అయి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. అనంతరం ఎస్సై చిర్ర సతీష్ కుమార్ మాట్లాడుతూ వాహనదారులు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్ కల్గి ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదాలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే పూర్తి చేయాలి



మల్యాలలో ధాన్యం పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

మల్యాల, మే 18: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం రైతులకు తీవ్ర నష్టం చేకుర్చుతుందని వెంటనే కొనుగోళ్లు పూర్తి చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోళ్ల నత్తనడకతో రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో బీజేపీ నాయకులు కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతుల నుంచి ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలతో ధాన్యం తడిచిపోతుందని కొనుగోళ్లు పూర్తి కాకపోవడంతో రంగు మారి మొలకలు వచ్చే పరిస్థితి నెలకొందన్నారు. తరుగుపేరిట మిల్లర్లు దోచుకుంటున్నారని, కృత్రిమ లారీల కొరతతో రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షుడు నేరెళ్ల శ్రావణ్‌కుమార్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్య క్షురాలు చైతన్య, గాజుల మల్లేశం, కట్కం లత, అవుదుర్తి రమ, చక్రంగౌడ్, జవ్వాజి రాజ్ కుమార్, నీలం రవి, బండారి రాజు, నల్ల జీవన్‌రెడ్డి, సంకుర్తి వేణు, అంజి, గోపిరెడ్డి, ఆనందం, సునంద, మహేష్ పాల్గొన్నారు.

కథలాపూర్: అకాల వర్షాలకు తడిచిన వరి ధాన్యంను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం బీజేపీ నాయకులు మండలం లోని కొనుగోలు కేంద్రాల వద్ద నిరసన తెలిపారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ పిలుపు మేరకు అంబారిపేట, తాండ్ర్యాల, దూలూరు, తక్కళ్లపల్లి, బొమ్మెన, గంభీర్‌పూర్, పోసానిపేట, ఊటప్లలి, కథలాపూర్ గ్రామాల్లోని ధాన్యం కేంద్రాలను పరిశీలించారు. తడిచిన ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: ధాన్యం కొనుగోళ్లను అధికారులు వేగవంతం చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి కోరారు. శనివారం మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల బీజేపీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షం వస్తే ధాన్యం తడుస్తుందని త్వరితగతిన ధాన్యం తూకం వేసి రైతులకు ఇబ్బందులు కాకుండ చూడాలన్నారు. వర్షం వచ్చి ధాన్యం తడిస్తే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీజేపీ నాయకులు రాజేశం, రాకేష్, భూమేష్, తిరుపతిరెడ్డి, రాజు, మహేందర్, దేవందర్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కథలాపూర్, మే 18 : ఈ నెల 19న తాండ్ర్యాల, అంబారిపేట, గంభీర్‌పూర్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ భూమేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. అంబారిపేట, కలికోట, ఇప్పపల్లి, పోతారం, తుర్తి, తాండ్ర్యాల, గంభీర్‌పూర్ గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల దాకా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొడిమ్యాల: కొడిమ్యాల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ రఘునాథ్ తెలిపారు. 11 కెవీ కొడిమ్యాల టౌన్ ఫీడర్ విద్యుత్ లైన్‌కు సమీపంలోని చెట్ల కొమ్మలు తొలిగించడానకి, ఇతర మరమ్మతుల దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. కొడిమ్యాల పట్టణ విద్యుత్ వినయోగదారులు సహకరించాలని కోరారు.

ప్రమాదకర విద్యుత్ స్తంభం తొలగింపు

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

పెగడపల్లి, మే 18 : మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఎదుట నడిరోడ్డుపై ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం అంటూ ఈ నెల 17న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం ఉదయం నడిరోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించారు. దీంతో మండల ప్రజలు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎల్‌వోసీ మంజూరు

కథలాపూర్, మే 18 : మండలంలోని దూలూరుకు చెందిన మారంపల్లి గంగరాజం అనే వ్యక్తి అనారోగ్యంకు గురి కాగా వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సిఫారసుతో రు. 2.50 లక్షల ఎల్‌వోసీ మంజూరైందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు తెలిపారు. అత్యవసర ఆరోగ్య చికిత్స అవసరమని ఎమ్మెల్యేకు తెలపగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారని తెలిపారు.

వైభవంగా వాసవి మాత జయంతి

కోరుట్ల, మే 18 : పట్టణంలోని అర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం వాసవి మాత జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. వాసవి మాత అలయంలో అమ్మవారికి లక్షపుష్పార్చన కార్యక్రమాన్ని జరిపి ప్రత్యేక పూజలను జరిపారు. గణపతి హోవనం, కుంకుమార్చన కార్యక్రమాలను నిర్వహించంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నా మొక్కులు చెల్లించుకొన్నారు. ఈ కార్యక్రమంలో అర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

గొల్లపల్లి : మండల కేంద్రంలోని వాసవీ మాత జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమీటీ అధ్యక్షలు బొల్లం రమేష్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ మాతకు పాలాభిషేకం, హోమం కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. మహిళలచే కుంకుమార్చన కార్యక్రమాన్ని కన్నులపండువలా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణ, మం డల ఆర్యవైశ్యా సంఘం నాయకులు, సంఘం సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి తమ కుల దైవా నికి ప్రత్యేక పూజలు చేశారు.

యూనిఫాం అందించాలి

ఎల్లారెడ్డిపేట, మే 18: మహిళా సంఘాల సభ్యులకు సరఫరా చేసిన దుస్తులను జూన్ 5లోగా పాఠశాల విద్యార్థులకు అందించాలని అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్ ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కుట్టు కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న యూనిఫాం తయారీలో మహిళలు జాగ్రత్తలు పాటించాలన్నారు. విద్యార్థులకు సరిపడా వివిధ కొలతల్లో తయారు చేయాలన్నారు. అవసరమైన కటింగ్ మెషిన్లను సమకూర్చుకోవాలని సూచించారు. సకాలంలో పూర్తి చేసి విద్యార్థులకు అందించేలా చూడాలని అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్ అన్నారు. డీపీఎం సుధారాణి, ఏపీఎం మల్లేశం తదితరులు ఉన్నారు.